## క్లుప్తంగా

### 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

శాయంపేట : ప్రజలకు అందించాల్సిన రేషన్ బియ్యాన్ని ఇంట్లో నిల్వ చేశారనే సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. పత్తిపాక గ్రామానికి చెందిన బోయిని నాగరాజు ప్రజల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ చేసుకున్నట్లు తెలిపారు. పక్కా సమాచారం మేరకు శుక్రవారం దాడులు నిర్వహించగా పోలీసుల రాకను గమనించిన సదరు వ్యక్తి.. పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకున్నట్లు తెలిపారు. నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

### వర్ధంతికి తరలిన కాంగ్రెస్ నాయకులు



ఎల్కతుర్తి : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ 14వ వర్ధంతిని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహిస్తుండగా భీమదేవరపల్లి మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. నాయకులు రమేశ్, వీరన్న నాయక్, కృష్ణంరాజు, మోహన్, సుమన్, సంపత్, భీమ్‌రెడ్డి, నారాయణరావు, రత్నాకర్, గోపాల్‌రావు, లక్ష్మీపతి, సురేశ్, కొమురయ్య, యాదగిరి, రఘుపతి, జేమ్స్ పాల్గొన్నారు.

### ఓటరు జాబితా ప్రదర్శన



దామెర : వార్డుల వారిగా ఓటరు జాబితాను ప్రదర్శించిన్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ఎన్నిక సంఘం ఆదేశాల మేరకు గ్రామాల్లోని వార్డుల వారిగా ఓటర్ జాబితా తయారు చేసినట్లు తెలిపారు. కాగా వాటిని గ్రామపంచాయతీ కార్యాలయల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. ఓటర్ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 21వ తేదీ లోగా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా కోరారు.

### దీక్ష విరమించిన పావని

శాయంపేట : తనకు న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట భార్య పావని చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారం రెండోరోజు కొనసాగింది. అయితే గ్రామ పెద్దలు కుమారస్వామితో ఫోన్‌లో సంప్రదింపులు జరిపి సమస్యను కొలిక్కి తీసుకొచ్చి ఎట్టకేలకు మధ్యవర్తిత్వంతో సానుకూలంగా పరిష్కరించారు. దీంతో పావని, కుటుంబ సభ్యులు దీక్షను విరమించారు.

### తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

శాయంపేట : తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణను శుక్రవారం కొత్తగట్టు సింగారం కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షుడు రమేశ్, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. యూత్ నాయకులు వినయ్, రవికుమార్, రమేశ్, మొగిలి పాల్గొన్నారు.

### బీఎస్‌యూ నూతన కమిటీ ఎన్నిక

శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన పెంబర్తి భరత్‌ను బహుజన స్టూడెంట్ యూనియన్ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద సురేష్ శుక్రవారం ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా పరకాల రాజుకుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్‌ను నియమించినట్లు తెలిపారు. తమ నియామకానికి సహకరించిన నాయకులకు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మండల నాయకులు కార్తిక్, సాయి, నాగరాజు, అరవింద్, ప్రసాద్ పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నక్కలగుట్ట, మచిలీబజార్ సబ్ స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 7.30గంటల నుంచి 9 గంటల వరకు, న్యూశాయంపేట, పెద్దమ్మగడ్డ, ఆర్ఈసీ, సోమిడి, వడ్డపల్లి, టెక్స్‌టైల్ పార్కు, రాంపూర్ సబ్ స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అదే విధంగా కాజీపేటలోని బాపూజీ నగర్, శాంతినగర్, కాజీపేట మెయిన్ రోడ్, అమీర్ హోటల్, అంబేడ్కర్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన ప్రకటనలో కోరారు.

# గణపయ్యకు మహా నైవేద్యం

- 151 రకాల పిండివంటకాలతో అన్నప్రసాదం వితరణ
- జిల్లా వ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు



కమలాపూర్ : గణపతికి 151 రకాల ప్రసాదాలతో మహా నైవేద్యం సమర్పిస్తున్న విద్యార్థులు

కమలాపూర్ : గణపతి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని విశ్వభారతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడికి నిర్వాహకులు, విద్యార్థులు 151 రకాల పిండి వంటలు, ప్రసాదాలతో శుక్రవారం మహా నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజానన భక్త భజన మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద సామూహిక కుంకుమ పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. అలాగే విఘ్నేశ్వర భక్త భజన మండలి ఆధ్వర్యంలో, రాములపల్లిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. విశ్వభారతి హైస్కూల్ కరస్పాండెంట్, హెచ్‌ఎంలు మధుబాబు, రాజ్‌కుమార్, నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

వేలేరు : కులమతాలకు అతీతంగా వేలేరు మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ దంపతులు వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవుడు అందరికీ ఒక్కడేనని, హిందూ, ముస్లింలు అన్నదమ్ముళ్లుగా కలిసి ఉండాలని కోరారు. అదే విధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో గణేశ్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానాలు, భజనలు కొనసాగుతున్నాయి.



కమలాపూర్ : రాములపల్లిలో అన్నప్రసాద వితరణ చేస్తున్న నిర్వాహకులు



వేలేరు : వినాయక పూజలో పాల్గొన్న ముస్లిం దంపతులు

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాల వద్ద భక్తులు నిత్యం భజనలు చేస్తుండగా.. పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం భజరంగ్ యూత్, త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బోనపల్లి రఘుపతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : భజన చేస్తున్న భక్తులు



శాయంపేటలో..



కమలాపూర్‌లో..

## ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలి



ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఐనవోలు : కమ్యూనిస్టు నాయకుడు సీతారాం ఏచూరి మృతి భారత రాజకీనాయలకు, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య అన్నారు. ఏచూరి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని నంది సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ.. కమ్యూనిస్టు దిగ్గజం ఏచూరి అన్నారు. ఆయన మరణ వార్త విని పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారన్నారు. భూపోరాట ఉద్యమాలకు తన తోడ్పాటు అందించడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాతో అనుబంధం ఏర్పడిందన్నారు. ప్రజా సంఘాల రాష్ట్ర నాయకుడు అమరవాది సారంగపాణి, నాయకులు నారాయణరెడ్డి, నాగరాజు, బాబురావు, రాంకుమార్, కవిత, యాకయ్య, మహేందర్, గోపాల్‌రావు పాల్గొన్నారు.

## ప్రమాణస్వీకారానికి తరలిరావాలి

ఐనవోలు : ఈనెల 15న హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ప్రమాణ స్వీకారానికి ఎన్ఎస్‌యూఐ, ఐఎన్‌సీ పూర్వ, ప్రస్తుత నాయకులు తరలిరావాలని ఏఐసీసీ జాయింట్ కో ఆర్డినేటర్, మధ్య ప్రదేశ్ ఏబీసీ ఇన్‌చార్జ్ ఉల్లెంగుల యాదగిరి శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచి క్రియాశీలక కార్యకర్తగా పనిచేసి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగిన మహేష్‌కుమార్‌కు అందరు అండగా నిలవాలని కోరారు. ఈ నియామకం గ్రామస్థాయి కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ఒక నూతన ఉత్సాహాన్ని, నమ్మకాన్ని కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం



ఎల్కతుర్తి : బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు



కమలాపూర్ : పోలీసుల అదుపులో నాయకులు



శాయంపేట : అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు



ధర్మసాగర్ : అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు



దామెర : అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు

ఎల్కతుర్తి : ఇంట్లో ఉన్న తమను పోలీసులు అన్యాయంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పార్టీ హైదరాబాద్‌లో నిరసనకు పిలుపినచ్చిన నేపథ్యంలో తమను అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయడం అమానుషమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అని చెప్పుకుంటూనే రౌడీపాలన కొనసాగిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కడారి రాజు, నాయకులు గొడిశాల వినయ్, కొమ్మిడి మైపాల్‌రెడ్డి, పైడిపెల్లి కిరణ్, ఎమ్‌కే యాదవ్ అరెస్టయిన వారిలో ఉన్నారు.

ఆత్మకూరు : బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్‌లో నిరసన తెలిపేందుకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆ పార్టీ ఆత్మకూరు గ్రామ అధ్యక్షుడు పాపని రవీందర్, మండల కేంద్రానికి చెందిన ఎండీ.అంకూస్, రేవూరి సంపత్‌రెడ్డి, తిరుమలగిరికి చెందిన మిర్యాల శ్రీనివాస్, కుమారస్వామి అరెస్టయిన వారిలో ఉన్నారు.

శాయంపేట : సైబరాబాద్ కమిషనరేట్ ముట్టడికి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపునివ్వడంతో శుక్రవారం తెల్లవారు జామున బీఆర్ఎస్ నాయకులను స్థానిక ఎస్సై ప్రమోద్‌కుమార్ అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్వంత పూచికత్తుపై మధ్యాహ్నం విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో శాయంపేట, మైలారం గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు రాజేందర్, శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి పలువురు నాయకులు ఉన్నారు.

కమలాపూర్ : బీఆర్ఎస్ పిలుపు మేరకు హైదరాబాద్‌లో చేపట్టే నిరసనకు వెళ్తారనే సమాచారం మేరకు మండలంలోని బీఆర్ఎస్ నాయకులను స్థానిక పోలీస్‌లు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు అరెస్టయిన వారిలో ఉన్నారు.

ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బొడ్డు ప్రభుదాస్, లాల్‌మహ్మద్, మెరుగు రాజిరెడ్డి, బొడ్డు ప్రతాప్, దంతూరి బాలరాజు, శివ అరెస్టయిన వారిలో ఉన్నారు.

దామెర : అక్రమ అరెస్టులతో భయపెట్టలేరని మాజీ వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ అన్నారు. ఎమ్మెల్యే హరీష్‌రావు, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికు మద్దతుగా శుక్రవారం హైదరాబాద్ బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. అరెస్టయిన వారిలో ప్యాక్స్ చైర్మన్ బొల్లు రాజు, జిల్లా నాయకులు దాడి మల్లయ్య, గరిగె కృష్ణమూర్తి, మంతుర్తి రాకేష్ ఉన్నారు.

## ఊరు ఒకవైపు.. సూచిక మరోవైపు

వేలేరు : మండలంలోని పీచర క్రాస్ నాలుగు కూడళ్ల వద్ద పలు గ్రామాలకు వెళ్లేందుకు సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. కానీ ఆ బోర్డును నమ్మి ప్రయాణిస్తే అంతే సంగతులు. ఒక ఊరికి బదులు మరోక ఊరికి చేరుకోవాల్సిందే. కొన్ని రోజుల కిత్రం క్రాస్ రోడ్డు వద్ద ఏ గ్రామానికి ఎటువైపు వెళ్లాలనే దిక్కులను సూచిస్తూ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే అది కాస్త తప్పుల తడాఖాగా తయారు చేశారు. పీచర, నారాయణగిరి, మల్లికుదుర్ల గ్రామాలు ఒకే వైపు ఉన్నట్లు బాణం గుర్తు చూపిస్తుంది. అలాగే పీచర గ్రామానికి వ్యతిరేక దిశలో వెళితే నారాయణగిరి గ్రామం వస్తుంది. ధర్మసాగర్ వెళ్లే దారిలో సోడాషపల్లి, మల్లికుదుర్ల గ్రామాలు వస్తాయి. కొత్తగా గ్రామాలకు వెళ్లాల్సిన వారు అయితే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుందని పలువరు ఆందోళన చెందుతున్నారు. రహదారుల సూచిక బోర్డును నమ్మి ప్రయాణిస్తే ఒక గ్రామానికి వెళ్లే ప్రయాణికులు మరోక గ్రామానికి చేరుకుంటారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే సూచిక బోర్డు మార్చాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.



పీచర క్రాస్ రోడ్డు నాలుగు కూడళ్ల వద్ద తప్పుగా చూపిస్తున్న సూచిక బోర్డు

## సౌండ్‌సిస్టం అందజేత



వేలేరు : మండలంలోని పీచర ఫ్రెండ్స్ యూత్ వినాయక భక్తమండలికి మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, ఎర్రగొల్ల ఎల్లయ్య రూ.20వేల విలువ చేసే సౌండ్‌సిస్టంను శుక్రవారం అందించారు. భజన మండలి భక్తుల ఆకాంక్ష మేరకు సౌండ్ సిస్టంను అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజయ్య, సంపత్, కృష్ణ, శ్రీనివాస్, ఈశ్వరయ్య, కూమారస్వామి, సంతోష్ పాల్గొన్నారు.

## అటెన్షన్ ప్లీజ్

### రైతుబజారును కొనసాగించరూ..



మండల కేంద్రంలో ఎన్ఆర్ఐ నర్సింహారెడ్డి సహకారంతో డాక్టర్ బూర గోపాలకృష్ణ మెమోరియల్ రైతు బజార్‌ను నిర్మించారు. ఈ రైతు బజార్ మూడు రోజులే కొనసాగింది. రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.
– ఆత్మకూరు

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ
ఫోన్‌నంబర్ : 9281479600

## భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- ఆర్డీఓ నారాయణ

శాయంపేట : ఈనెల 16వ తేదీన నిర్వహించే గణేశ్ నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని పరకాల ఆర్డీఓ నారాయణ అధికారులకు సూచించారు. మండలంలోని పత్తిపాక-ప్రగతిసింగారం గ్రామాల మధ్య చలివాగు బ్రిడ్జిపై గల నిమజ్జన ప్రదేశాన్ని, దేవుని చెరువు వద్ద గల నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. నిమజ్జన ప్రదేశాల వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగేలా చూడాలన్నారు. తహసీల్దార్ కల్వల సత్యనారాయణ, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఎమ్మార్వై శరత్ కుమార్, ఎస్సై ప్రమోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ పాల్గొన్నారు.

పరకాల : గణేశ్ నిమజ్జనంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత తెలిపారు. శుక్రవారం పరకాల శివారులోని చలివాగు ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ, కౌన్సిలర్స్‌తో కలిసి సందర్శించి గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బంది ఉన్నారు.



శాయంపేట : దేవుని చెరువును పరిశీలిస్తున్న ఆర్డీఓ నారాయణ

ఎల్కతుర్తి : గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో ముగించాలని సీఐ పులి రమేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఎల్కతుర్తి సర్కిల్ పరిధిలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, వంగర పీఎస్ పరిధిల్లో నిర్వహించే గణేశ్ నిమజ్జనంలో ఏలాంటి అపశ్రుతి చోటు చేసుకోకుండా నిర్వహకులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపులో డీజే సౌండ్‌కు అనుమతి లేదని, రెండు స్పీకర్లు మాత్రమే వినియోగించాలని తెలిపారు. చెరువులు, కుంటలు పూర్తిగా నిండి ఉన్నందున లోనికి వెళ్లొద్దని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు పోలీస్‌లకు సహకరించాలని ఆయన కోరారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



పిల్లలకు అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ మంజుల

శాయంపేట : మండలంలోని గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. ప్రగతి సింగారం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, తల్లులు, పిల్లలు, పాలు, ఆకుకూరలు, పండ్లు, పోషక తినాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తుందని, తల్లులు వినియోగించుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు పద్మజ, శ్రీలత, వీఓఏ రమ్యబాయి, రాజేశ్వరి పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకోవాలి

దామెర : మహాలక్ష్మి పథకాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎంపీడీఓ ఆదేశాల మేరకు శుక్రవారం పత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు రూ.500 గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.



పత్రాలను పంపిణీ చేస్తున్న కార్యదర్శి వేణుగోపాల్

## ఇంటింటా సర్వేను త్వరగా పూర్తిచేయాలి

- తహసీల్దార్ సత్యనారాయణ

శాయంపేట : మండలంలో బీఎల్‌ఓలు చేపట్టిన ఇంటింటా ఓటరు సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని తహసీల్దార్ సత్యనారాయణ సూచించారు. ఫారం-7 ద్వారా మృతి చెందిన ఓటర్లను తొలగించాలని అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సూపర్‌వైజర్లు ప్రతి రోజు పర్యవేక్షించి జాబితాను త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు. బీఎల్‌ఓలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మార్వై శరత్‌కుమార్, ఏఆర్ఐ రమేష్, సీనియర్ అసిస్టెంట్ అబ్బారావు, జూనియర్ అసిస్టెంట్ శైలజ, రాజు, రికార్డు అసిస్టెంట్ సత్యం, తులసి, మోహన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

### 16న మద్యం షాపులు బంద్

శాయంపేట : ఈనెల 16వ తేదీన వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకొని ఉదయం 6 గంటల నుంచి 17వ తేదీ ఉదయం 6 గంటల వరకు మండలంలోని మద్యం షాపులను మూసివేయనున్నట్లు పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

### పోషణ మాసోత్సవం

ఖిలా వరంగల్: పోషణ మాసోత్సవం సందర్భంగా వరంగల్ 39వ డివిజన్ శాకరాశికుంటలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ సుభాషిణి గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.